1St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 252 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 15 ఆగస్టు 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 252 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 15 August 2025 PAGES : 8 PRICE : 3/-

# రాష్ట్ర ఆదాయం పెంచాలి..

## పన్ను ఎగవేతకు ఏఐతో చెక్

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8% ఆదాయ వృద్ధి లక్ష్యం
- కాంట్రాక్టర్లు రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ కొనేలా చర్యలు
- మద్యం ఆదాయం కన్నా ప్రజారోగ్యమే ప్రభుత్వానికి ముఖ్యం
- ఎర్రచందనం విక్రయాలతో రూ.1,500 కోట్ల ఆదాయంపై అంచనా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 14)

గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్ధిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయంలో 8 శాతం వృద్ధి నమోదు కానుందనే అంచనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆదాయార్జనలో మరింత శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర నిధులు, టాక్స్ డెవల్యూషన్‌పై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఏపీ టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించాలని, సేవల రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

గురువారం నాడు ఆదాయార్జన శాఖలపై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సొంత ఆదాయ వనరులు పెంచుకునేందుకు అన్ని మార్గాలపైన దృష్టి పెట్టాలని సూచించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో చేపట్టే కాంట్రాక్టు పనులకు వినియోగించే వాహనాల పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులను రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు -మిగతా 2లో




# పులివెందులలో 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛ



**పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థుల గెలుపు**
**30 ఏళ్ల తర్వాత ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారన్న లోకేశ్**
**విజయం సాధించిన లతారెడ్డి, కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు**
**భారీగా తరలివచ్చి మద్దతిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 14)

కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితాలపై మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత పులివెందులలో తొలిసారిగా నిజమైన ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇది ఎంతో కష్టపడి సాధించిన విజయమని అభినందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. పులివెందుల, -మిగతా 2లో

# పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నిక.. వైకాపా పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 14)

వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి వైకాపా దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో, ఒంటిమిట్టలోని 30 పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని వైకాపా పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రీ పోలింగ్ అంశంపై ఈసీ నిర్ణయం తీసుకుంటుందని, ఈసీ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు ఘోర పరాభవం ఎదురైంది. పులివెందులలో తెదేపా అభ్యర్థి లతారెడ్డి 6,035 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు లభించాయి. -మిగతా 2లో

# ఒంటిమిట్ట, పులివెందులలో తెదేపా ఘన విజయం.. చతికిలపడిన వైకాపా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 14)

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు ఘోర పరాభవం ఎదురైంది. ఫలితాల్లో తెదేపా అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. ఆమె 6,035 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు -మిగతా 2లో

# జగన్‌కు బుద్ధి చెప్పాలనే ఆలోచనతోనే ప్రజలు గెలిపించారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 14)

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో తెదేపా విజయంపై ఆ పార్టీ నేత బీటెక్ రవి స్పందించారు. గతంలో పులివెందులలో ధైర్యంగా ఓట్లు వేసే పరిస్థితులు లేవన్నారు. ధైర్యంగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తాము ప్రజలకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు. "గతంలో పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా చేశారు. ఇవాళ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓట్లు వేశారు. జగన్‌కు బుద్ధి చెప్పాలనే ప్రజల ఆలోచన, తెదేపా అమలుచేసిన పథకాలే పార్టీ విజయానికి దోహదం చేశాయి" అని బీటెక్ రవి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే తెదేపాకు ఓట్లు వేస్తారనేందుకు నిదర్శనం ఈ ఎన్నికలు అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వైకాపా చేతుల్లో ఉన్న సిట్టింగ్ స్థానాలను గెలుచుకున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నమ్మకంతో ప్రజలు తెదేపాకు విజయం కట్టబెట్టారని పేర్కొన్నారు.



# పాకిస్థాన్ రాకెట్ ఫోర్స్ ఏర్పాటు ప్రధాని షెహబాజ్ ప్రకటన

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 14)

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ క్షిపణుల దెబ్బ రుచి చూసిన పాకిస్థాన్ ఇప్పుడు రాకెట్ ఫోర్స్ ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం అర్ధరాత్రి ఓ కార్యక్రమంలో ప్రకటన చేశారు. పాక్ సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేలా ఈ రాకెట్ ఫోర్స్ పనిచేస్తుందని వెల్లడించారు. దీనికి అత్యాధునిక టెక్నాలజీని సమకూరుస్తామని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక దళంపై ఆ దేశ సైనికాధికారి ఒకరు మాట్లాడుతూ.. దీనికి ప్రత్యేకమైన కమాండ్ -మిగతా 2లో






# అలా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుంది: గడ్కరీ

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 14)

భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ -మిగతా 2లో

ePaper www.shanmukhavelugu.com

## బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 14)**

మండల బిజెపి కార్యాలయం నుంచి భారీ జాతీయ జెండాతో యువత జాతీయ జెండాలను చేత పట్టుకొని "వందేమాతరం" " భారత్ మాతాకీ జై" "స్వతంత్ర భారత్ కీ జై " అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా కన్వీనర్ సయ్యద్ ఖాదర్ భాషా, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు చంద్రశేఖర్, పొదిలి మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అనకర్లపూడి రహదారి అస్తవ్యస్థం





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)**

కొండపి నుండి అనకర్ల పూడి మీదకు వెళ్లే ఒంగోలు ఆర్ అండ్ బి రహదారిలో కొండపి నుండి అనకర్లపూడి వరకు రోడ్డు కిరువైపులా భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలతో రోడ్డు కిరువైపులా బురదతో భారీ గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆర్అండ్‌బి ప్రధాన రహదారిని బాగు చేయాల్సిందిగా మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.2.24 లక్షల చెక్కులు అందించిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి

### డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఆగస్టు 14)**

మండలంలోని కెల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జి అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 2.24 లక్షలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అందజేశారు. గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయం తూర్పునాయుడుపాలెంలో చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నెలకుర్తి కోటేశ్వరమ్మ రూ. 32,000, కట్ల పూజిత రూ. 32,000, బల్లిపల్లి అశోక్ రూ. 1,60,000 వేలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాలడుగు రమేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# రాష్ట్ర ఆదాయం పెంచాలి..

తీసుకోవాలన్నారు. కొన్ని కాంట్రాక్టు సంస్థలు పొరుగు రాష్ట్రాల్లో పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేయటం వల్ల రాష్ట్ర ఆదాయం కోల్పోతున్నామని, దీనిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మద్య ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యం

కూటమి ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు, ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగానే భూ రిజిస్ట్రేషన్ విలువలు ఉండాలని నిర్దేశించారు. క్రయ విక్రయాలును శాస్త్రీయంగా విశ్లేషించాలని... భూమి విలువలు పెంచుకుంటూ పోవటం సరికాదని అన్నారు. మార్కెట్ విలువలు, ప్రాపర్టీ డేటా కోసం డేటా అనలటిక్స్ వినియోగించాలని అన్నారు. పన్ను ఎగవేతలను గుర్తించడానికి, ప్రభుత్వ ఆదాయంలో లీకేజీలను అరికట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు చేయండంతో పాటు సాంకేతిక వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

ఈవీలకు రాయితీల కొనసాగింపు

భూమి వివరాలను జీఐఎస్ ద్వారా ల్యాండ్ మ్యాపింగ్ చేయాలని, ఈ-రిజిస్ట్రేషన్లు, బౌండరీలను జీఐఎస్ సహాయంతో మ్యాప్ చేయాలని సూచించారు. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను ఉపయోగించాలని సీఎం స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీని కొనసాగించాలని ఆదేశించారు. స్క్రాప్ వాహనాల పాలసీని కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్, శాటిలైట్ టెక్నాలజీతో గనుల తవ్వకాలను గుర్తించి డేటా అనలటిక్స్ ద్వారా ఆదాయాన్ని పర్యవేక్షించాలని సీఎం స్పష్టం చేశారు.

మున్సిపాలిటీల్లో ఆటో మ్యుటేషన్

ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే వివరాలతో పాటు టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ఆటో మ్యుటేషన్ జరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ రికార్డుల్లో తప్పులు సవరించి జియో ట్యాగింగ్ చేయాలని సీఎం సూచించారు. ఆధార్, మొబైల్, ఎలక్ట్రిసిటీ డేటాను కూడా అనుసంధానించి పన్ను వసూళ్ళ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వే ద్వారా గ్రామకంఠాల గుర్తింపు ప్రక్రియ 2026 ఫిబ్రవరికి పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. పంచాయతీల్లో నిర్వహించే ఖాతాలను ఆడిట్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అటవీశాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలతో రూ. 1,500 కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశముందని... అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలపై దృష్టి పెట్టాలన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా ఆదాయం ఆర్జించే మార్గాలను కూడా చూడాలన్నారు.

# పులివెందులలో 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛ

ఒంటిమిట్ట ప్రజలు తిరోగమనాన్ని కాదని, పురోగతికి పట్టం కట్టారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థుల విజయం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన మారెడ్డి లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల మద్దతుతోనే ఈ విజయం సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు.

# పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నిక.. వైకాపా పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు లభించాయి. ఈ స్థానానికి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీపడ్డారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైంది.

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఈ ఉప ఎన్నికలో ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు రాగా, .. వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# ఒంటిమిట్ట, పులివెందులలో తెదేపా ఘన విజయం.. చతికిలపడిన వైకాపా

100 లోపు ఓట్లు లభించాయి. ఈ స్థానానికి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీపడ్డారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైంది.తెదేపా అభ్యర్థిని మంత్రి సవిత అభినందించారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందే పులివెందులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందుల కోటను బద్దలు కొడతామన్నారు. ఈ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటిమిట్టలో తెదేపా విజయం

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఈ ఉప ఎన్నికలో ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు రాగా, .. వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# పాకిస్థాన్ రాకెట్ ఫోర్స్ ఏర్పాటు ప్రధాని షెహబాజ్ ప్రకటన

ఉంటుందని పేర్కొన్నారు. సంప్రదాయ యుద్ధం జరుగుతున్న వేళ క్షిపణుల మోహరింపు వంటి అంశాలను ఇదే చూసుకొంటుందని పేర్కొన్నారు. ఈ రాకెట్ ఫోర్స్‌ను భారత్‌ను దృష్టిలో ఉంచుకొనే ఏర్పాటు చేస్తున్నట్లు ఓ ఆంగ్ల వార్త సంస్థకు ఆయనే వెల్లడించారు.

అంతకు ఒక రోజు ముందే పాక్ (%ఆబిదిరిరిశిబిదీ%) ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై బెదిరింపు ప్రకటనలు చేశారు. సింధూ జలాల నుంచి న్యూదిల్లీ ఒక్క చుక్క నీరు తీసుకొన్నా సహించేది లేదని పేర్కొన్నారు. భారత్ ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామని ప్రేలాపనలు చేశారు. ఈ జలాలు పాక్‌కు ప్రాణాధారమని పేర్కొన్నారు. వీటి విషయంలో రాజీ పడే పరిస్థితే లేదని చెప్పారు.

బేరింగ్ జలసంధి మీదుగా అలాస్కాకు పుతిన్

మరోవైపు పాకిస్థాన్‌లో పీపీపీ నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై విషం కక్కారు. మోదీ (%ఆఖ ఖళిఖిరి%)కి వ్యతిరేకంగా ఏకం కావాలని పాకిస్థానీలకు పిలుపునిచ్చారు. ఇక ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ మరో అడుగు ముందుకేసి.. అమెరికా వేదికగా అణు బెదిరింపులకు పాల్పడ్డారు. 'భారత్ హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం ఓ డంప్ ట్రక్కులాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?" అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో సోమవారం కథనాలు వచ్చాయి. తమ దేశం ఇబ్బందుల్లో పడితే సగం ప్రపంచాన్ని తమతోపాటు తీసుకెళతామని చెప్పారు. సింధూ నదిపై డ్యామ్ నిర్మిస్తే క్షిపణులతో పేల్చేస్తామని కూడా వ్యాఖ్యానించారు. అమెరికా (%ఏఐజు%) అండ చూసుకొని భారత్‌పై అవాకులు చెవాకులు పేలడం మునీర్‌కు కొత్తేమీ కాదు.

# అలా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుంది: గడ్కరీ

మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో అనివార్య పరిస్థితుల్లో దేశ విభజన జరిగిందన్నారు.

"భారత్-పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగింది. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా మారుతుంది" అని గడ్కరీ పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఆత్మనిర్భరత సాధించడంతోపాటు విశ్వగురువుగా భారత్ మార్చేందుకు కృషి చేయాలని గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో భారత్ బలంగా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుందన్నారు. ఆర్థికంగా, రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో అగ్రగామిగా ఉండటంతోపాటు ప్రతి పౌరుడు దేశభక్తితో ఉన్నప్పుడే 'విశ్వగురువు'గా మారుతుందన్నారు.

# ఉపాధి హామీ రక్షణ కోసం ఉద్యమించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ నిర్ణయం**

**నూతన అధ్యక్షుడిగా నెరుసుల వెంకటేశ్వర్లు,**

**కార్యదర్శిగా కంకణాల ఆంజనేయులు తిరిగి ఎన్నిక**

**13 మందితో ఆఫీస్ బేరర్స్,**

**25 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

పేదలందరికీ భూములు పంచాలని, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం అమలు జరపాలని, ఉపాధి హామీని రక్షించుకోవాలని అందుకోసం ఉద్యమాలు చేపట్టాలని ఈ నెల 12, 13 తేదీల్లో కనిగిరిలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్ణయించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు గురువారం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలియజేశారు. జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు ఉన్నాయని, ఈ భూములు అత్యధిక శాతం అక్రమార్కుల కబ్జాకు గురయ్యాయని అన్నారు. వీరి కబంధహస్తాల నుండి ప్రభుత్వం బయటకు తెచ్చి, పేదలకు పంపిణీ చేసే వరకు ఉద్యమాలు చేపట్టాలని మహాసభలో ప్రధాన తీర్మానం చేసినట్లు తెలిపారు. 36 వేల ఎకరాల దేవాదయ భూములు ఉన్నాయని, ఇవి పేద, సన్నకారు, వ్యవసాయ కూలీ కుటుంబాలకు ప్రభుత్వం లీజు కు ఇవ్వాలని అందుకోసం ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు పక్కా గృహాలు ఒక నిరమైన సామాజిక సమస్యగా ఉన్నాయని తెలిపారు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి కనీసం ఆరు లక్షల చొప్పున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 729 పంచాయతీలు ఉండగా, సుమారు నాలుగు వందలు గ్రామాలలోని దళితవాడలకు స్మశానాలు లేవని, కొన్నిచోట్ల కేటాయించినవి కూడా ఆక్రమణలకు గురయ్యాయని, వీటిని పరిశీలించి స్మశాన భూముల రక్షణ కోసం కూడా ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కరువు కాలంలో పేదల కడుపు నింపే లక్ష్యంతో వచ్చిందని తెలిపారు. కానీ దానికి కేటాయించిన నిధులను అధికార పార్టీ నేతలు, గ్రామాలలోని పెత్తందారులు అడ్డగోలుగా మెక్కుతున్నారని అన్నారు. పనులు చేయకుండానే బిల్లులు చేసుకుంటున్నారని, పనిచేసిన వారికి సకాలంలో వేతనాలు రావట్లేదని ఈ చట్టాన్ని సమగ్రంగా కాపాడుకునేందుకు విశాల ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పేదల కుటుంబాలను మద్యం మహమ్మారి చిన్నభిన్నం చేస్తున్నదని, పేదల చేతికి వచ్చిన ఆదాయంలో ఘననీయమైన భాగం మద్యానికి పోతున్నదని అన్నారు. ప్రభుత్వాలు మధ్యాన్ని ఆదాయ మార్గంగా చూడటం అమానుషమని అన్నారు. మద్యం, మత్తు పదార్థాల సేవనానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం చేపట్టాలని, మధ్య నిషేధం వైపుగా ప్రభుత్వాలు అడుగులు వేయాలని అందుకోసం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలు, ప్రభుత్వాలు వేస్తున్న చార్జీలు, భారాలతో పేదల జీవితాలు సతమతమవుతున్నాయని, ప్రతి కుటుంబం అప్పులతో ఉన్నదని అప్పుల రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. మహాసభలు చివరిగా రామన్న మూడేళ్లకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా తిరిగి నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులును ఎన్నుకున్నారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా జాలా అంజయ్య, బడుగు వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి మాల్యాద్రి, మల్లెల సంపూర్ణ, వేసుపోగు మోజస్, సహాయ కార్యదర్శులుగా కె. జీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు 13 మందుతో ఆఫీస్ బేరర్స్, 25 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మహాసభల జయప్రధానికి సహకరించిన అందరికీ జిల్లా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## 79వ స్వాత్రంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)**

బ్రిటీష్ వారి పాలన నుండి విముక్తి పొందటానికి నిర్వహించిన జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు,త్యాగధనులు పోరాటాలు చేశారు. దేశ విముక్తి కోసం చేసిన పోరాటం ప్రపంచంలోనే అపూర్వమైనది. దీర్ఘకాలంగా సాగిన పోరాటంలో ఎంతోమంది స్ఫూర్తి ప్రదాతలు అసువులు బాసారు. వారి త్యాగ ఫలితమే ఈ రోజు మనం అనుభవిస్తున్న భారత దేశ సార్వభౌమత్వన్నీ సమగ్రతను కాపాడుకోవడం మన భాద్యతగా భావించాలి. స్వాత్రంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనులకు నివాళులు అర్పిస్తూ గర్వంగా త్రివర్ణ పతకానికి సెల్యూట్ చేద్దాం. ఈ సందర్భంగా ప్రజలందరికి స్వాత్రంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అవును ఆ ముగ్గురు ఒక చోట చేరారు

## అందరికీ ఆదర్శంగా నిలిచారు
## గొబ్బూరులో మానవీయతకు ముద్ర వేసిన అరుదైన క్షణం
## మూడు జెండాలు, మూడు రాజకీయ ప్రస్థానాలు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఆగస్టు 14)

రాజకీయ రంగం అంటే చాలా మందికి గుర్తుకువచ్చేది వేదికల పై పరస్పర విమర్శలు, సభల్లో ఘాటైన ఆరోపణలు, ఎన్నికల సమయంలో సవాళ్లు. కానీ ఆ రాజకీయ నేతల మధ్య ఉన్న వ్యక్తిగత బంధం, ఆప్యాయత, మానవీయ గౌరవం సాధారణ ప్రజలకు తరచూ కనబడదు. అయితే యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండల గొబ్బూరు గ్రామం గురువారం ఆ అరుదైన దృశ్యానికి సాక్ష్యమైంది. ఇక్కడ జరిగిన వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఏలూరు నారాయణరెడ్డి కుమారుని వివాహ వేడుక వేదిక కేవలం శుభకార్యానికే కాకుండా, రాజకీయాలకు అతీతమైన స్నేహానికి కూడా వేదికయ్యింది. ఒకే వరుసలో పక్కపక్కనే కూర్చున్న ముగ్గురు రాజకీయ పటిమ కలిగిన నాయకులు మార్కాపురం నియోజకవర్గ ప్రస్తుత టిడిపి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, జంకె వెంకటరెడ్డిలు అందరి దృష్టిని తమవైపు తిప్పుకున్నారు.

### వీరి రాజకీయ ప్రస్థానాలు వేరు


వీరిలో ప్రతి ఒక్కరి రాజకీయ ప్రస్థానం వేరు. ఒకరు కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. మరొకరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలిచారు. ఇంకొకరు వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలిచారు. మూడు వేర్వేరు పార్టీలు, మూడు వేర్వేరు సిద్ధాంతాలు, మూడు వేర్వేరు కాలాల్లోని ప్రజా సేవా పథకాలు, అయినప్పటికీ వారందరికీ ఒకే సామాజిక వర్గపు మూలాలు, రాజకీయాలకతీతమైన మానవీయ బంధం ఉంది.

### రెండు నియోజకవర్గాల్లో పట్టున్న నేతలు

మార్కాపురం నియోజకవర్గం మాత్రమే కాక, పొరుగు యర్రగొండపాలెం నియోజకవర్గంలో కూడా ఈ ముగ్గురి పేర్లు ఒక గౌరవ భావన కలిగిస్తాయి. వారి మధ్య వ్యక్తిగత పరిచయం, స్నేహం, పరస్పర గౌరవం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఎవరింట శుభకార్యం జరిగినా, అవకాశం ఉన్నప్పుడు ఒకరినొకరు ఆహ్వానించుకోవడం, హాజరవడం, ఆప్యాయంగా పలకరించుకోవడం వీరి అలవాటు. ఈ వివాహ వేడుకలో కూడా అదే ముద్ర పడింది. పసుపు జెండా ఎగరేసే టిడిపి ఎమ్మెల్యే పక్కన, ఒకప్పుడు కాంగ్రెస్ జెండా కింద గెలిచిన నాయకుడు, మరొకవైపు వైసీపీ పతాకం ఎగరేసిన మాజీ ఎమ్మెల్యే ఈ ముగ్గురూ పక్కపక్కనే కూర్చుని ఆనందంగా ముచ్చట్లు పంచుకోవడం చూసిన వారు కాసేపు మౌనంగా ఆ దృశ్యాన్ని ఆస్వాదించారు. కొందరికి ఇది ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో విభేదాలు, వైరం ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరికొందరికి ఇది ఆనందాన్ని కలిగించింది. ఎందుకంటే ఇలాంటివి అరుదైన, కానీ సమాజానికి అవసరమైన దృశ్యాలు. ఈ సందర్భంలో ఒక వృద్ధ రైతు మాటలు ప్రత్యేకం "పార్టీలు వచ్చి పోతాయి – అధికారాలు మారుతాయి కానీ మనసు గెలిచిన నాయకులు మాత్రం ఎప్పటికీ ప్రజల హృదయాల్లో ఉంటారు". నిజమే, ఈ ముగ్గురి ప్రవర్తన అదే నిరూపించింది. సామాజిక మాధ్యమాల్లో ఈ క్షణం ఫోటో వైరల్ అవుతూ చాలామంది దానికి "పిక్ ఆఫ్ ది డే" అని శీర్షిక పెట్టారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులు ఒక్క క్షణానికి కలిసిపోయి, మానవీయత అనే ఒకే రంగులో మెరిసిన దృశ్యం అది. ఈ క్షణం మళ్లీ ఒకసారి మనకు గుర్తు చేసింది. రాజకీయాలు పదవులు ఇస్తాయి కానీ మానవీయతే గౌరవాన్ని ఇస్తుంది.

# పుల్లలచెరువు వైసీపీలో పూర్తిగా బయటపడ్డ వర్గపోరు


(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఆగస్టు 14)



మండలంలోని వైఎస్ఆర్సీపీలో వర్గ పోరు తారస్థాయికి చేరింది. 2019 ఎన్నికల తరువాత వైసీపీ అధికారం వచ్చిన ఒక సంవత్సరంలోనే పుల్లలచెరువు మండలంలో వర్గపోరు బయటపడ్డది. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక నాయకుడి మాట సాగిందని రెండో వర్గం వారు అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ పై కూడా బహిరంగంగా సమావేశాలు ఏర్పాటు చేసి మాటల తూటాలు పేల్చారు. ఇదిలా ఉండగా ఇక్కడ ఉన్న రెండో వర్గం నాయకులు ఆ నాయకుడిపై గట్టిగానే వ్యతిరేక పెంచుకున్నారు. అయితే 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి చెందడంతో అందరూ కలసిపోతారు అనుకుంటే అదికాస్తా చిలికి చిలికి గాలి వానగా మారింది. ఒక మండల నాయకుడు వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో పుల్లలచెరువు టీడీపీకి బలం చేకూరింది. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి బాబు షూరిటి...మోసం గ్యారెంటీ కార్యక్రమానికి రాష్ట్ర మంతటా చేయాలని ఆదేశించడంతో ఇక్కడి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రతి మండల కేంద్రంలో నిర్వహించారు. అందులో భాగంగా పుల్లలచెరువు మండల కేంద్రంలో ఈ నెల ఆరోవ తారీఖు నిర్వహించిన బాబు షూరిటి..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఒక వర్గాన్ని వేదికపై పిలవకుండా అవమాన పరిచారని ఎమ్మెల్యే ముందే రెండు వర్గాలు చిర్రు బుర్రు ఆడుకున్నారు. అయితే గురువారం మల్లపాలెం గ్రామంలో జరిగిన బాబు షూరిటి మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఒక వర్గం కనిపించక పోవడంతో వర్గపోరు పూర్తిగా బయటపడ్డదని వైసిపిలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే రానున్న రోజుల్లో పుల్లలచెరువులో వైసీపీ పూర్తిగా బలహీన పడటం ఖాయమని చర్చించుకుంటున్నారు. రెండు వర్గాలు ఒకటవుతాయో లేక వైసీపీని బలహీన పరుస్తారో వేచి చూడాలి.

# ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుంది

## రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)

ఆపదలో ఉన్న బాధితులను అదుకోవడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో 121 మంది లబ్ధిదారులకు రూ. 60.77 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. వీటితో పాటుగా బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాసిన లేఖను కూడా బాధితులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్యం పట్ల అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) నుంచి చేస్తున్న సహాయమే దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి

# భూగర్భ నీటి మట్టాన్ని పెంచేలా దృష్టి సారించాలి

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

భూగర్భ నీటి మట్టాన్ని పెంచేలా నీటి సంరక్షణ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయటంపై మరింత దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. భూగర్భ నీటిమట్టం పెంపు, సమర్థంగా వరద నీటి నిర్వహణ పై గురువారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డిఆర్ఓ బి చిన ఓబులేసు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పంటలకు అవసరమైన నీటి భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణ కట్టడాలను పూర్తి చేయడం ద్వారా అధిక వర్షాలు కురిసినప్పుడు భూమిలో తేమ పెరిగి తరువాతి ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోయినా పంటలను కాపాడుకునే వీలు ఉంటుందన్నారు.

# మార్కాపురంలో "అన్నదాత సుఖీభవ"

## పండుగ వాతావరణంలో రైతన్నల సంబరాలు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)

మార్కాపురం పట్టణం గురువారం పండుగ వాతావరణంతో కళకళలాడింది. "అన్నదాత సుఖీభవ" పథకం విజయాన్ని గుర్తు చేసుకుంటూ రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనమైన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అల్లూరి పోలేరమ్మ గుడి నుండి అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ వరకు భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో, బ్యానర్లు, పసుపు జెండాలతో సాగిన ర్యాలీ పట్టణ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ర్యాలీ అనంతరం మార్కెట్ యార్డులో విజయోత్సవ సభ అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ "గత వైసీపీ ప్రభుత్వం అన్నదాతలకు సంవత్సరానికి కేవలం రూ. 13 వేలే చెల్లించగా, తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి, మూడు విడతలుగా సంవత్సరానికి రూ. 20 వేల చెల్లింపులు చేస్తున్నది. ఇదే మా పార్టీ మాట, మా నిబద్ధత" అని అన్నారు.



### జిల్లా పునర్విభజన

"వైసీపీ పాలనలో పశ్చిమ ప్రకాశం తీవ్ర అన్యాయం ఎదుర్కొంది. మేము మార్కాపురం ప్రత్యేక జిల్లా కోసం ఉద్యమిస్తే వైసీపీ నాయకులు మనపై విమర్శలు చేశారు. కానీ ఇప్పుడున్న తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, త్వరలోనే మార్కాపురం

# భూగర్భ నీటి మట్టాన్ని పెంచేలా దృష్టి సారించాలి





ఆయా జిల్లాలోని భూగర్భ నీటిమట్టం, తదితర వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని వివరించారు. స్థానిక పరిస్థితులకుతోడు పరిమితికి మించి భూగర్భ నీటిని వినియోగించడం వలన పశ్చిమ ప్రాంతంలో భూగర్భ నీటిమట్టం పడిపోయిందన్నారు. ఈ పరిస్థితిని మెరుగుపరచడం పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. భూగర్భ నీటి సంరక్షణలో రిలయన్స్ ఫౌండేషన్ వంటి సంస్థలను కూడా భాగస్వాములను చేసినట్లు చెప్పారు. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిని కూడా భాగస్వాములను చేసి వారి అవసరాల మేరకు డ్వామా ఆధ్వర్యంలో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా ' వాటర్ బడ్జెట్ ' రూపల్పన చేశామన్నారు. వాన నీటిని నిలువచేసే నిర్మాణాలు ( రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ) జాతీయ స్థాయిలో ప్రకాశం జిల్లాలో ఎక్కువగా చేపట్టామని కలెక్టర్ తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ వీటి నిర్మాణంతోపాటు నిర్వహణపైనా తగినంత దృష్టి పెట్టాలన్నారు. భూగర్భ, ఉపరితల నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా నీటి ప్రవాహంలో ఇబ్బందులు లేకుండా కాలువలను శుభ్రం చేయటంలోనూ, నీటి సరఫరాలోనూ సాగునీటి సంఘాలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. నీటి నిర్వహణ పై ఇక నుంచి రెండు వారాలకు ఒకసారి తాను వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని కలెక్టర్లకు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులతో పాటు సాగునీటి సంఘాల ( డీ.సీ.లు, పీ.సీ.లు, డబ్ల్యు.యూ.ఏ.లు) చైర్మన్లు, వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.

# మార్కాపురంలో "అన్నదాత సుఖీభవ"







జిల్లా ఆవిర్భావం ఖాయం చేశారు" అని చెప్పారు.

**అభివృద్ధి పనులు ప్రస్తావిస్తూ.....**

"మార్కాపురం నియోజకవర్గంలో 100 కి.మీ.లకుపైగా సిసి రోడ్లు వేసాం. ఇప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయి, మిగతావి త్వరలోనే పూర్తి చేస్తాం. పార్టీలకు అతీతంగా పెన్షన్లు అందిస్తున్నాం. వైసీపీ పాలనలో పెన్షన్లలో కూడా వివక్ష చూపారు. కానీ ఇప్పుడు పెరిగిన పెన్షన్లు ప్రతి నెల 1వ తేదీనే అందుతున్నాయి" అని అన్నారు.

**ప్రజా సంక్షేమ పథకాల విషయంలో...**

"తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఉన్న ప్రతి విద్యార్థికి రూ.13 వేల చొప్పున ఖాతాల్లో జమ చేశాం. స్త్రీ శక్తి పథకం కింద నేటి నుండి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం" అని వివరించారు.

**పార్టీ విజయాల గురించి ప్రస్తావిస్తూ....**

"తెలుగుదేశం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే పార్టీ. 'సూపర్ సిక్స్ హామీలు – సూపర్ డూపర్ హిట్' అన్నది మా నినాదం. దానికి నిదర్శనం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఒంటిచేత్తో విజయం సాధించడం. పులివెందులలో వైసీపీ కనీస డిపాజిట్ కూడా రాలేదు. ఇది ప్రజలు తెలుగుదేశాన్ని ఎంతగా నమ్ముతున్నారో చూపిస్తుంది" అని వైసీపీకి హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, అనేక మంది రైతులు, మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయోత్సవాన్ని ఘనంగా జరిపారు. మార్కాపురం పట్టణమంతా పసుపు జెండాలతో, నినాదాలతో, ఉత్సాహభరిత కేరింతలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం, పొదిలి ఏఎంసి ఛైర్మన్‌లు మాలపాటి వెంకట్‌రెడ్డి, డాక్టర్ సయ్యద్ ఇమాంసా, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉలవపాడు డిగ్రీ కళాశాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 14)

మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు గురువారం 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీనుద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ మూడు రంగుల జెండా మన జాతి గౌరవానికి ప్రతీక అని, ప్రతి ఇంటిపై సగర్వంగా ఎగురవేయాలని తెలిపారు. ఈ ర్యాలీలో కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పరిసర ప్రాంతాల్లోని ఇంటింటికి తిరిగి జెండా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుంది



నుంచి ఇప్పటివరకు కొండపి నియోజకవర్గంలో 631 మంది లబ్ధిదారులకు రూ.5.73 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు. పేదలకు ఆరోగ్య పరంగా ఆర్థిక తోడ్పాటు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా సిఎం సహాయ నిధి నుండి 450 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఆగష్టు 15 న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు విరివిగా పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రజలకు సూచించారు. అనంతరం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో జరుగుమల్లి మండలం, చతుకుపాడు గ్రామంలోని తారక రామ సి.హెచ్.సి గ్రూపుకు కిసాన్ డ్రోన్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి స్వయంగా కిసాన్ డ్రోన్‌ను ఆపరేట్ చేసి డెమో కార్యక్రమంలో పాల్గొన్నారు. కిసాన్ డ్రోన్ యూనిట్ విలువ రూ.9.80 లక్షలు కాగా, ఇందులో రూ. 7.84 లక్షలు సబ్సిడీ పోనూ, గ్రూప్ వాటాగా రూ.1.96 లక్షలు అని మంత్రి వివరించారు.

# రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

# సిపిఐ రాష్ట్ర మహాసభలని జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 14)

ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎనుబరి రవీంద్రబాబు పిలుపునిచ్చారు. కనిగిరిలోని స్థానిక దర్శి చెంచయ్య భవనంలో గురువారం జరిగిన వాల్ పోస్టర్ల ఆసవిష్కరణ లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వంద సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల ఘన చరిత్ర కలిగిన సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28 వ మహాసభలు ఆగస్టు 20 నుంచి 25వ తేది వరకు జిల్లా కేంద్రం అయినటువంటి ఒంగోలులో జరుగుతున్నాయన్నారు. 23వ తేదీన వేలాది మందితో ప్రజా ప్రదర్శన అనంతరం భహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. జమిందారి జాగీర్దారి సంస్థానాలను రజాకార్ల దురాగతాలకు వ్యతిరేఖంగా సిపిఐ పోరాడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల పక్షాన నిలిచి దేశ ప్రజల సామాజిక రాజకీయ ఆర్థిక హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందని తెలిపారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఒంగోలు నగరంలో రాష్ట్ర మహాసభలను మొట్టమొదటిసారిగా నిర్వహించటం జరుగుతుందని వారు అన్నారు. సిపిఐ కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ సిపిఐ మన ప్రకాశం జిల్లాలో పోరాటాలను నడిపిందని, వెంకటగిరి జమిందారీ భూములను పేదలకు పంచడంలో కీలక పాత్ర పోషించింది అని అన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కొరకు రామాయపట్నం ఓడరేవు స్థాపన కొరకు నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం పాలేరు ప్రాజెక్టుల మరమ్మత్తు కొరకు ఒంగోలు పాల డైరీ పునః ప్రారంభించాలని. ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రాజీలేని పోరాటాలు చేసిందని అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలు సాగు భూములు సాధించి పెట్టిందని వారు అన్నారు. ఈ మహాసభలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించవలసిన అవసరం మనందరి మీద ఉందన్నారు. ఈ మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతాయన్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది ప్రజలు కార్మికులు పాల్గొంటారని వారు అన్నారు. ఈ మహాసభలకు మన ప్రాంతము నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కనిగిరి నియోజకవర్గం సహాయ కార్యదర్శి పందిటి మోహన్, మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, మీరావలి, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాల్రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మాచపల్లి పూర్ణచంద్ర రాజు, మహిళా సంఘం నాయకులు అంజమ్మ, బషీర, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇఫ్రాజ్, తాహిద్ తదితరులు పాల్గొన్నారు.



# క్రిష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 14)

భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, క్రిష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ,మార్కాపురం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దేవరాజుగట్టు ప్రైమరీ, హై స్కూల్‌లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించడం, కళారూపాలు ప్రదర్శించడం, మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలపై చర్చలు నిర్వహించడం జరిగింది. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల త్యాగాలను స్మరించుకుంటూ, విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు, పాల్గొన్న విద్యార్థులకు కళాశాల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన చినారికట్ల, రేగడపల్లి సొసైటీ అధ్యక్షులు

సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 14)

కొనకనమిట్ల మండలం చినారికట్ల, రేగడపల్లి సొసైటీ అధ్యక్షులుగా నియమితులైన సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావులు గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి వెంట గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మాజీ మండల కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్వ కాటంరాజు, వెలుగొండ దేవస్థాన చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కు చాకిచర్ల విద్యార్థులు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 14)

మండలంలోని చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 15 వాలీబాల్ సెలక్షన్స్ కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే జనార్దన్ రావు తెలియజేశారు. బుధవారం త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాలుర సెలక్షన్స్ లో ఎంపిక చేసిన ఆరుగురు క్రీడాకారులలో పాఠశాలకు చెందిన బి.రాజేష్, వి. మహేష్ మంచి ప్రతిభ కనబరిచి ఈనెల 18వ తేదీ విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు ఎంపికైనారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంపికలో రాష్ట్రం నుండి 8 మంది బాలుర క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయస్థాయి సెలక్షన్స్ లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొంటారు. జాతీయస్థాయిలో జరుగు సెలెక్షన్స్ లో ఇండియా టీం ఎంపిక చేసి డిసెంబర్ లో చైనాలో జరుగు మొదటి స్కూల్ గేమ్స్ అండర్ 15 ప్రపంచస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో భారత జట్టు తరఫున పాల్గొంటారని పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు ఓగుబోయిన శ్రీనివాసులు చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్ సుధాకర్, గ్రామస్తులు అభినందించారు.

# వెలుగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి పాలేరు, ముసికి నీటి కేటాయింపులు

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మలకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)




వెలుగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి పాలేరు, ముసికి నీటి కేటాయింపులు చేసినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామనాయుడుకి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ దీని వల్ల కనిగిరి పరిసర గ్రామాలతో పాటు పొన్నలూరు, మర్రిపూడి, జరుగుమల్లి, సింగరాయకొండ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీంతో పాటు పాలేరుపై ఉన్న సంగమేస్వర ప్రాజెక్ట్, ఈవీ చానల్ కి ఇది ఉపయోగకరమన్నారు. ఈ నీటి కేటాయింపులతో వర్షాభావ ప్రాంతాలకు సాగు, త్రాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఈ ప్రాంత రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు మంత్రి స్వామి తెలిపారు.

# అప్రజాస్వామిక విజయం పై ఇంత రాద్ధాంతం అవసరమా

**వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ కటికల**

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 14)



అప్రజాస్వామికంగా ప్రజలు ఎవరిని ఓటు హక్కు వినియోగించుకోకుండా నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్లను తీసుకుని వచ్చి దొంగ ఓట్లు వేసుకొని పులివెందులలో గెలిచామనడం హేయమని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రజాస్వామ్యం ఖూనీ జరుగుతున్న ఎన్నికల కమిషన్ రాష్ట్ర పోలీస్ యంత్రాంగం చూస్తూ ఉండిపోతున్నాయని అన్నారు. మొన్న జరిగిన పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజలు పోలీసులను తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కాళ్లు పట్టుకొని వేడుకోవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా హక్కుల పరిరక్షణ ఎటువైపు దారితీస్తుందన్న సందేహం వ్యక్తం అవుతుందని రాష్ట్ర యస్ సి సెల్ కటికల వెంకటరత్నం అన్నారు. ఇకనైనా టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయకుండ ప్రజలకు మేలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పులివెందుల ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో అప్రజాస్వామిక విజయాన్ని ప్రజలవరు స్వాగతించడం లేదని ఆయన తెలిపారు. పులివెందుల ఒంటిమిట్టలో ఎన్నికలను రద్దుచేసి కేంద్ర బలగాలతో ఎన్నిక నిర్వహించాలని ఆయన కోరారు.

# కరేడు గ్రామంలో 30వ యాక్టు వెంటనే తొలగించాలి

**రైతు ఉద్యమ నాయకుడు, 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు**

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 14)





కరేడు రైతు జేఏసీ నాయకులు గురువారం కందుకూరులో సబ్ కలెక్టర్‌ను కలసి కరేడు గ్రామంలో 30వ యాక్టు వెంటనే తొలగించాలని, అలాగే గతంలో గ్రామసభ జరగగా మళ్లీ మళ్లీ గ్రామసభ జరుపుతామని అధికారులు ప్రకటించడంపై జాయింట్ కలెక్టర్ కి గ్రామ ప్రజలు అభ్యంతరం తెలుపగా అర్జీ రూపంలో సబ్ కలెక్టర్‌కి సమర్పించడం జరిగిందని రైతు ఉద్యమ నాయకుడు, 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నది లేనట్లుగా లేనిది ఉన్నట్లుగా వక్రీకరిస్తూ ప్రకటన చేయటం అధికారులకు తగదని అన్నారు. భూములను రక్షించుకోవటానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని సబ్ కలెక్టర్‌కి వివరించటం జరిగినదన్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ అన్ని విషయాలను పరిశీలించి ఒక మంచి నిర్ణయం తెలియజేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారని అలాగే కందుకూరు డీఎస్పీని, సిఐని కలసి వినతి పత్రాలు సమర్పించామని శ్రీనివాసులు ఒక ప్రకటనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు నాయకులు బొమ్మిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు ఆర్ మోహన్, పందలపాటి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల గొంతులను హరించే ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఖండించండి

## అప్రజాస్వామిక సర్క్యులర్‌ను రద్దు చేయాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

గత 70 సంవత్సరాల నుంచి విద్యార్థుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం రాజీ లేకుండా పోరాడుతున్న విద్యార్థి సంఘాలను నియంత్రించాలని ప్రభుత్వం తీసుకువచ్చిన అప్రజాస్వామిక సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, పడీఎస్‌యు, ఏఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కార చేయమని అడిగితే, విద్యార్థి సంఘాలను నియంత్రించాలనుకోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శమని వారు విమర్శించారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిస్వార్థంగా విద్యార్థుల సమస్యల కోసం విద్యార్థి సంఘాలు పోరాటాలు చేసాయన్నారు. విద్యార్థుల పోరాటాల వల్ల విద్యా హక్కు చట్టాన్ని తీసుకువచ్చాయన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో సరైన టీచర్లు కావాలని, సొంత బిల్డింగులు కావాలని, ల్యాబ్లు కావాలని, సమయానికి పాఠ్య పుస్తకాలు కావాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధుల పెంచాలని, చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని అడగటమే విద్యార్థి సంఘాలు చేసిన తప్పా అని ప్రశ్నించారు? మరొకవైపున ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర్నుంచి విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు, షూ, బెల్ట్, ట్రై,ల రూపంలో వందల కోట్లు వసూలు చేస్తున్న, గుర్తింపు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా? అని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో వివిధ రకాల కారణాలతోటి విద్యార్థులు ఆత్మహత్యలకు బలవుతుంటే ప్రశ్నించకూడదా అని అన్నారు? నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మా సంఘాలను కలుపుకొని అప్పటి ప్రభుత్వం మీద పోరాటాలు చేయలేదా అని ప్రశ్నించారు? విద్యార్థి సంఘాలు విద్యార్థులకు రాజకీయాలు నేర్పకూడదు అంటూ మాట్లాడుతున్నారే, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు,లోకేష్, ఒకటి,రెండు కుటుంబాలు తప్ప ఇంకే విద్యార్థి రాజకీయాలు చేయకూడదా అని ప్రశ్నించారు. విద్యార్థి సంఘాలు ఉండటం వల్ల ఏ విద్యార్థికి నష్టం జరగదని, వారు ప్రభుత్వానికి విద్యార్థులకు మధ్య వారదులుగా ఉంటూ విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని, అటువంటి వాటిని నియంత్రించాలని ప్రభుత్వం తీసుకువచ్చిన సర్క్యులర్ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లాలో కొందరు విద్యార్థి సంఘాల పేరుతోటి కొన్ని విద్యాసంస్థల వద్దకు వెళ్లి అరాచకాలు చేస్తున్నాయని మా దృష్టి కూడా వచ్చిందని, అటువంటి వాటి నియంత్రణ కొరకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఎటు వంటి చర్యలు తీసుకున్న వాటికి మా వామపక్ష విద్యార్థి సంఘాల నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాలుగా మేము రాజకీయంగా చైతన్యవంతమై, అనేక ఉన్నత చదువులు చదువుకొని, నిస్వార్థంగా విద్యార్థుల సంక్షేమం కోసం పోరాడుతున్నాము. మేము ఏ ప్రైవేట్ విద్యాసంస్థల పట్ల వ్యతిరేకత భావన కలిగి ఉండము. గతంలో ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్లు, మా వామపక్ష విద్యార్థి సంఘాలు కలిసి ప్రభుత్వం మీద అనేక పోరాటాలు చేశాయని గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు,, ప్రైవేటు సంస్థలు విద్యా సంస్థల వద్దకు వచ్చి బెదిరిస్తున్నారని మాకు సమాచారం అందింది. అటువంటి వాటికి మాకు సంబంధం లేదు. కనుక ఎప్పటి లాగానే ప్రైవేట్ యాజమాన్యాలు మా వామపక్ష విద్యార్థి సంఘాలకు సహాయ సహకారాలు అందిస్తారని, ప్రభుత్వం తీసుకు వస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడుదమని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె వీరస్వామి, పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి సీహెచ్ శాంసన్, పీడీఎస్‌యు ఒంగోలు నగర నాయకుడు పి మోషీ, సురేష్, రఫీ, చరణ్, దావీదు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌ను పరిశీలించిన మేయర్, కమిషనర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)





ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ కోదూరు వెంకటేశ్వరరావు గురువారం కొత్తమామిడిపాలెంలో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌ని మేయర్ గంగాడ సుజాత, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్, మేయర్, జీటీఎస్ (గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్) ఆవరణలో గల నగరపాలక సంస్థ సిబ్బంది తో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్ ని పరిశీలించారు. కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చెయ్యడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నామని, దానిలో భాగంగా ఇక్కడ వర్మీ కంపోస్ట్ ద్వారా ఎరువులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. దీని కోసం కూరగాయల మార్కెట్ నుంచి తడి చెత్తని సేకరించటం, వానపాములను తీసుకురావటం కూడా శానిటేషన్ వర్కర్స్ చేస్తున్నారు అని తెలిపారు. అలానే ఈ జిటిఎస్ కి వచ్చే చెత్త నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయటానికి సానిటరీ సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగింది అని, ఇక్కడ నుంచి వేరు చేసిన తడి చెత్త తో పాటు కూరగాయల మార్కెట్ నుంచి సేకరిస్తున్న తడి చెత్తను కూడా ఈ వర్మీకంపోస్టు లో ఉపయోగిస్తున్నట్లు సిబ్బంది కమీషనర్‌కి తెలిపారు. పొడి చెత్త ని కేంద్రీకరించుటకు బైలింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు, అలానే వాటి పని తీరును సిబ్బంది కమీషనర్, మేయర్‌కి చూపించటం జరిగింది. ఒంగోలు నగరంలో గల ప్రజలను కూడా హెూమ్ కంపోస్టింగ్ మీద అవగాహనా కలిపిచేవిదంగా చర్యలు తీసుకొంటాము అని కమీషనర్ తెలిపారు. పేర్నమిట్ట ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న జిటిఎస్‌కి సంబంధించి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి దానిని కూడా త్వరలో ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకొంటున్నట్లు కమీషనర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ కే వెంకటేశ్వరరావుతో పాటు నగర మేయర్ గంగాడ సుజాత, ఎంఈ ఇసాయ్య, ఎంహెచ్ఓ వైష్ణవి, ఎస్ఎస్ బాబ్జి, ఏఈ నాగార్జున, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పులివెందుల జెడ్పీటీసీ గెలుపు సుపరిపాలనకు ప్రజల బహుమతి

**వైసీపీ గెలిస్తే వీరత్వం,**
**ఓడితే ప్రజాస్వామ్యం లేదనడం జగన్ దివాళకోరుతనానికి నిదర్శనం**
**జగన్ చంద్రబాబును విమర్శించడం కాదు,**
**పార్టీ మూసుకుని తీర్థయాత్రలకు పోతే బెటర్**
**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఆగస్టు 14)



ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సుపరిపాలనకు ప్రజల చూపించిన నమ్మకం, వారిచ్చిన బహుమతే పులివెందులలో చారిత్రాత్మక విజయమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంతే గాక చరిత్రలో తొలిసారిగా జగన్ రెడ్డి కుటుంబానికి పెట్టని కోటగా భావించిన పులివెందులలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి లత ఘన విజయం సాధించడం ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తరపున విజయం సాధించిన లతారెడ్డికి అభినందనలు తెలిపిన ఆయన వైకాపాకు 685 ఓట్లు మాత్రమే రావడం, డిపాజిట్ కూడా కోల్పోవడం, జగన్ రెడ్డి, వైకాపా స్వయంకృతం అన్నారు. దశాబ్దాల తర్వాత పులివెందులలో ఓటర్లకు రిగ్గింగ్, బెదిరింపుల భయం లేకుండా, స్వేచ్ఛగా ఓటు వేయగల వాతావరణం కలగడంతోనే ప్రజాస్వామ్యానికి ఈ విజయం లభించినట్లు భావిస్తున్నామన్నారు. తాము కూడా వైకాపా తరహాలో మేము రాజకీయాలు చేసి ఉంటే, 11 మంది అభ్యర్థులు పోటీలోనే నిలిచి ఉండేవారా అని జగన్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. నిజానికి ఒంటిమిట్ట, పులివెందులలో ఓటమి ఖాయమని తెలిసి కారణాలు వెతకడం, ప్రజలను తప్పుపట్టడం అనేది ఓడిపోయిన జగన్ విపరీత మానసిక స్థితికి ఉదాహరణగానే కనిపిస్తోందన్నారు. గెలిచినప్పుడు వీరత్వం, ఓడిపోయినప్పుడు ప్రజాస్వామ్యం లేదనడం జగన్ దివాళా రాజకీయాలు కాక మరేంటని చురకలు వేశారు. అన్నింటికంటే మించి జగన్ చంద్రబాబును విమర్శించడంతో పాటు రాజకీయాలే మానేసి పార్టీ మూసుకుని తీర్థయాత్రలకు వెళ్ళడం మంచిదని ఎద్దేవా చేశారు. కేంద్ర బలగాలు కాదు, అంతర్జాతీయ బలగాలు పెట్టినా, చచ్చిన వైకాపాను మళ్ళీ లేపడం అసాధ్యమన్న జీవీ గతంలోనే వైకాపా గెలిచినప్పుడు, కుప్పం మున్సిపాల్టీని కైవసం చేసుకున్నప్పుడు జగన్ అలానే చేశారని తూర్పారబట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే పులివెందులలోనే జగన్ పతనం మొదలైందని, లోకేష్ నాయకత్వంలోని తెలుగుదేశం దూకుడుకు కూడా ఈ ఫలితాలు అద్దం పడుతున్నాయన్నారు. పులివెందుల ప్రజలు, కూటమి కార్యకర్తలు, మద్దతుదారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# 'ఆస్టర్ రమేష్'లో విజయవంతంగా గుండెకు శస్త్ర చికిత్స

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

జిల్లాలో మొట్టమొదటిసారిగా జీరో కాంట్రాస్ట్ కరోనరీ ఎంజియో ప్లాస్టి అనే నూతన ప్రక్రియతో కిడ్నీలపై ఎటువంటి దుష్ప్రభావం కలగకుండా గుండెకు శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు స్థానిక ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం వంశీకృష్ణ తెలిపారు. హాస్పిటల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండెకు సంబంధించి రక్తనాళాలలో ఏంజియో ప్లాస్టి చేసే క్రమంలో సాధారణంగా 100 ఎంఎల్ నుండి 120 ఎంఎల్ వరకు కాంట్రాస్ట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కాంట్రాస్ట్ కొంత సమయం తర్వాత కిడ్నీల ద్వారా, మూత్రం ద్వారా బయటికి వచ్చేస్తుందని తెలిపారు. కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకి ఎంజియో ప్లాస్టి చేసే సమయంలో కిడ్నీపై కొంత దుష్ప్రభావం పడి డయాలసిస్ అవసరం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అటువంటి పేషెంట్లకు జీరో కాంట్రాస్ట్ కరోనరీ ఎంజియో ప్లాస్టిక్ నూతన ప్రక్రియ వలన కిడ్నీలపై ఎటువంటి దుష్ట ప్రభావం ఉండదన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ శబరిగిరీస్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన 67 సంవత్సరాల వృద్ధురాలు గుండె నొప్పి, హార్ట్ ఫెయిల్యూర్ తో హాస్పిటల్లో జాయిన్ అయ్యారన్నారు. పేషంట్ బిపి, షుగర్, కిడ్నీ ఫెయిల్యూర్ తో బాధపడుతూ ఉన్నారన్నారు. చికిత్సలో భాగంగా యాంజియోగ్రామ్ చేసి రెండు గుండె రక్తనాళాల్లో ప్రాణాంతకమైన బ్లాక్స్ గుర్తించడం జరిగిందని తెలిపారు. పేషెంట్ కు కిడ్నీ ఫెయిల్యూర్ దృష్ట్యా కాంట్రాస్ట్ ఇవ్వకుండా ఆధునికమైన ఇంట్రా వ్యాక్యులర్ అల్ట్రా సౌండ్ గైజెట్టి ఎంజియో ప్లాస్టి ద్వారా రెండు రక్తనాళాలలో విజయవంతంగా రెండు కార్డియాక్ స్టాంట్స్ అమర్చామని తెలిపారు. ఈ విధమైన జీరో కాంట్రాస్ట్ ఇమేజ్ గైటెడ్ కరోనరీ ఎంజియో ప్లాస్టి ఇప్పటివరకు దేశంలోని మెట్రో నగరాల కె పరిమితి పోయాయి అన్నారు. ఇటువంటి అడ్వాన్సులు ఎంజియో ప్లాస్టి నిర్వహించడానికి హాస్పిటల్ నందు అడ్వాన్స్ టెక్నాలజీ మరియు నైపుణ్యం కలిగిన టీం ఆఫ్ స్పెషలిస్ట్ డాక్టర్స్ ఆవశ్యకత ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం వంశీకృష్ణ, గుండె వైద్య నిపుణులు డాక్టర్ శబరి గిరీష్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ సిందిల్ కుమార్, డాక్టర్ సందీప్‌లను అభినందించారు.






# నేటి నుండి ఒంగోలు పుస్తక మహోత్సవం



## బుక్ ఫెస్ట్‌ను ప్రారంభించనున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతి రోజు సాహితీ సభలు, కళారూపాలు, సైన్స్ పై అవగాహన, చిన్నపిల్లల కార్యక్రమాలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ నిర్వాహకుల పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

స్థానిక పివిఆర్ బాలుర పాఠశాల ఆవరణంలో ఈ నెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు మూడవ ఒంగోలు పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విజయవాడ బుక్ ఫెస్ట్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ గంటలయ పరిషత్ ఆధ్వర్యంలో ఈ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పివిఆర్ గ్రౌండ్ ఆవరణములో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏమేస్కో ప్రచురణల ప్రతినిధి విజయకుమార్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చిన్నారులు పుస్తక పఠణానికి దూరమవుతున్నారన్నారు. సెల్ ఫోన్లకు, టీవీలకు బానిసలుగా మారుతూ సృజనాత్మకతను కోల్పోతున్నారన్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందన్నారు. దీనిని నిలువురించేందుకు ప్రతి ఒక్క తల్లిదండ్రి విద్యార్థులను పుస్తకాలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని, మంచి సమాజానికి పునాదివేయాలని కోరారు. అందులో భాగంగానే అమ్మకాలతో సంబంధం లేకుండా పిల్లలకు పుస్తకాలను మరింత దగ్గర చేసేందుకు ఈ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లల్ని తీసుకొని వచ్చి పుస్తక మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఈ పుస్తక మహోత్సవాన్ని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, కలెక్టర్ తమిమ్ అన్సారియా, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. పుస్తకం మహోత్సవం ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఒంగోలు ప్రజలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేస్తే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నెలకు రెండు సార్లు వంతున పుస్తక మహోత్సవాల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తక మహోత్సవ సందర్భంగా ప్రతిరోజు సాహితీ సభలు, పుస్తక పరిచయాలు, సైన్స్ ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పుస్తక మహోత్సవానికి తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి వచ్చి సందర్శించాలని కోరారు. పది రోజులు కార్యక్రమాల్లో భాగంగా పుస్తకాలు గురించి చర్చించడం, భాష గురించి, రచయితల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. 16వ తేదీన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు, ఈ కవి సమయాల్లో వంద మంది కవులు పాల్గొనన్నట్లు తెలిపారు. 17వ తేదీన నన్ను ప్రభావితం చేసిన పుస్తకం అనే అంశంపై వేదికపై అందరూ మాట్లాడే అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. 18వ తేదీన ' గ్రంథాలయాలు -సమాజం అని అంశంపై మేధో మధం జరుగుతుందన్నారు. 19వ తేదీన ప్రకాశం జిల్లా సాహిత్యం, చరిత్ర, సంస్కృతిపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. 20 తేదీన చలం రచించిన' స్త్రీ' కి నూరేళ్లు నిండిన సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీన దేవరాజు మహారాజు రచనల ఆవిష్కరణ, ఆయన సాహిత్యం పై చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటుగా ప్రతిరోజు జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించే మేకుల మంచం, గాజు పెంకులపై నడవడం, మాయా పెట్టె, వండర్ కోన్, మిరాకిల్ వీల్, వర్చువల్ రియాల్టీ షో, తో పాటుగా మ్యాజిక్ ఉంటుందని తెలిపారు. దానితో పాటుగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కథల వర్క్ షాప్, మట్టితో బొమ్మలు తయారుచేయుట, బొమ్మలు గీయుట, రంగులు వేయుట, మోనో యాక్షన్ పోటీలు, కథలు చదవడం, పాటల పోటీలు, ఉపన్యాసం పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు సీఏ ప్రసాద్ గతంలో తాను హైదరాబాద్, విజయవాడ బుక్ ఫెస్టులకు నిర్విరామంగా హాజరయ్యే వాడిని అన్నారు. ఒంగోలులో బుక్ ఫెస్ట్ కొనసాగించటం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త పొన్నూరి శ్రీనివాసులు,జన విజ్ఞాన వేదిక నాయకుడు జయప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

## మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 9 మందిని జైలుకి పంపిన ప్రకాశం పోలీసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పోలీసు స్టేషన్ ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినారు. డ్రంకన్ డ్రైవింగ్ టెస్ట్ లలో పట్టుబడిన వారిని తేది 14.08.2025 న గౌరవ కోర్ట్ వారి ముందు హాజరు పరచగా, వారికి గౌరవ న్యాయస్థానం వారు జైలు శిక్ష విధించారు. కంభం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఎస్సై నరసింహారావు తొమ్మిది మందిని గౌరవ గిద్దలూరు కోర్టులో హాజరపరచగా గిద్దలూరు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి భరత్ చంద్ర డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో తొమ్మిది మందికి జైలు శిక్ష విధించారు. ఇద్దరికి 20 రోజులు జైలు శిక్ష, రూ.15,000లు చొప్పున జరిమానా, ఇద్దరికి 15 రోజులు జైలు శిక్ష, రూ.15,000 రూపాయలు చొప్పున జరిమానా, ముగ్గురికి 10 రోజులు జైలు శిక్ష, రూ.10,000ల చొప్పున జరిమానా, ఒకరికి 7 రోజులు జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా, మరొకరికి ఒకరికి 5 రోజులు జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను శోక సంద్రంలోకి వెళ్ళనివ్వవద్దన్నారు. మద్యం సేవించ కుండా వాహనాలు నడిపిన యెడల ప్రమాదాల నుండి మీరు సురక్షితంగా ఉండడమే గాక, మీ తోటి వారిని సైతం రక్షించగలిగినవారవుతారన్నారు. అలాగే జిల్లాలోని జాతీయ, రాష్ట్రీయ రహదారుల్లో మద్యం మత్తులో జరిగే ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ అధికారులు ముమ్మర డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ప్రతిరోజు నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనం నడపకూడదని, పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచి జరిమానా, జైలు శిక్ష విధించేలా చేస్తామని హెచ్చరించారు.

# అధిక వేగంతో వాహనం నడిపిన యువకులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 14)

కనిగిరి మండలలో అనగా గురువారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించే లక్ష్యంగా కనిగిరి పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కనిగిరి టౌన్ పరిధిలో అధిక వేగం (ఓవర్‌స్పీడ్)పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా, నిబంధనలకు విరుద్ధంగా అధిక వేగంతో వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం, గుర్తించబడిన వాహన డ్రైవర్లను మరియు వారి తల్లిదండ్రులను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో, అధిక వేగం వల్ల కలిగే ప్రమాదాలు, వాటి పర్యవసానాలు, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్ణీత వేగ పరిమితిని పాటించడం వల్ల ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. తమ పిల్లలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారా, లేదా అని తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, వారికి తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా తోడ్పడిన వారవుతారన్నారు. ఈ డ్రైవ్ లో కనిగిరి సీఐ ఖాజావలీ, సర్కిల్ ఎస్సైలు మాధవరావు, శ్రీరామ్, కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.







# ప్రభుత్వం అందించే ధృవీకరణ పత్రాల పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారం ఉంటుంది

## సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

ప్రభుత్వం అందించే కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆర్థికంగా బలహీనమైన వారికి ఇచ్చేటువంటి పత్రాల విషయంలో స్వయం ఉపాధి పొందే విషయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తమ వంతు సహకారం అందిస్తుందని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని రూడ్ సెట్ కార్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి పాల్గొని ప్రసంగిస్తూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు మండల న్యాయ సేవా కమిటీలు అర్హులైన వారికి ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని మరియు ప్రభుత్వ పథకాలలో అర్హులైన వారికి అందే విధంగా న్యాయ సేవాధికార సంస్థలు పనిచేస్తాయని తెలిపారు మరియు అర్హత కలిగిన ప్రతి ఒక్క మహిళకు షెడ్యూల్ తెగలు మరి కులాలకు చెందిన వారికి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా న్యాయవాది నియమించి వారు న్యాయస్థానాల్లో న్యాయం పొందటానికి సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు పట్టణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అందించే ధ్రువీకరణ పత్రాలు, వాటి కాలవ్యవధిని వివరించారు. ఈ కార్యక్రమంలో బెంచ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కెనరా బ్యాంక్ లీడ్ మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులకు ఆశీర్వచనాలు అందజేసిన ఎమ్మెల్యే కందుల






(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 14)

శ్రీ వాసవి కళ్యాణ సదన్‌లో బుధవారం రాత్రి జరిగిన గునుపూడి మధుసూదన్‌రావు, వెంకట పద్మావతి ల కుమార్తె త్రినయని, వెంకట సాయి శ్రీ చంద్‌లను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేద ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతులు, గునుపూడి చెంచు సుబ్బారావు, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్, మహిళా నాయకులు షేక్ షహనాజ్ బేగం, షేక్ మెహరన్నిస బేగం, స్వామి రాజా, సోమిశెట్టి శ్రీదేవి, పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, ముల్లా జిందా బాషా, షేక్ సంధాని పాత్రికేయులు ముల్లా బడే, ఓబులశెట్టి రాధాకృష్ణ, కోవూరి శ్రీనివాసులు, ఎర్రారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి కుటుంబానికి సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

స్థానిక ఒంగోలు వెంకటేశ్వర కాలనీలో నివసించే గేర అరుణ్ బాబు చాలా పేద కుటుంబానికి చెందిన విద్యార్థి తండ్రి ఆటో తల్లి హాస్టల్లో పనిమనిషిగా జాబ్ చేస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడం వల్ల గేర అరుణ్ బాబు బీటెక్ సెకండ్ ఇయర్ జాయిన్ ఫీజు నిమిత్తం సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాత కుసు వేణుబాబు ఆర్థిక సహకారంతో మండవ మురళీకృష్ణ చేతుల మీగా రూ.15,000 రూపాయల ఆర్థిక సహాయం నేడు ట్రస్టు కార్యాలయంలో అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా మండవ మురళికృష్ణ మాట్లాడుతూ బాగా చదువుతూ ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి సూర్య శ్రీ ట్రస్ట్ ద్వారా అందజేస్తామని అట్టివారు ఎవరైనా ఉంటే ట్రస్టుకు సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సెక్రెటరీ సర్దార్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత మట్టి వినాయకుడిని పూజిద్దాం ప్రజలకు మంత్రి స్వామి పిలుపు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)

పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రజలందరూ రానున్న వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు నిచ్చారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో వాలంటీర్ ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ ప్రచురించిన లిమట్టి గణపతే మహాగణపతిలిఅన్న గోడ పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ప్రజలు, యువత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో రసాయన రంగులతో కూడిన విగ్రహాలు వినియోగం వీడి మట్టి విగ్రహారాధన ప్రకృతి ఆరాధనతో సమానమని, వీర భద్రాచారి లాంటి పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషి అభినంద నియమనిఅన్నారు. పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ వీర భద్రాచారి మాట్లాడుతూ ముఖ్యంగా యువత నిమజ్జనం సమయంలో ధ్వని, వాయు కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహ పరిమాణం భక్తికి కొలమానం కాదని, నిగ్రహంతో చేసే ప్రమాణమే భక్తికి కొలమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగమల్లేశ్వర రావు, సంస్థ సభ్యులు దార్ల శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 14)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభలు ఆగస్టు 12 ,13 తేదీలలో కనిగిరి వైయస్సార్ రోడ్డు లోని టీచర్స్ అకాడమీ నందు నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ర్యాలీ క్లబ్ రోడ్డు నందు బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ మహాసభలకు వివిధ రూపాల్లో సహకరించి విజయవంతం చేసినటువంటి సంఘం శ్రేయోభిలాషులకు దాతలకు మిత్రులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు కరువు ప్రాంతం వలసల ప్రాంతమైనటువంటి కనిగిరిలో ఆదరించినటువంటి ప్రతి ఒక్కరికి మహాసభ ర్యాలీ బహిరంగ సభ ప్రతినిధుల సభలో జయ ప్రధానికి కష్టపడి పనిచేసినటువంటి వాలంటీర్లకు మీడియా మిత్రులకు సహాయ సహకారాలు అందించినటువంటి అందరికీ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు

## ర్యాగింగ్ భూతాన్ని అంతమొందించాలి

### శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని ఒంగోలులోని సి ఎస్ ఆర్ శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శర్మ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, యాంటీ ర్యాగింగ్ అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన.. వక్తృత్వ పోటీలకు డిగ్రీ విద్యార్థుల నుండి చక్కటి ప్రతిస్పందన రావడం ఎంతో సంతోషాన్ని కలుగ చేసిందని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైన అంశమని వివరించారు. క్రమశిక్షణ మీరి సాటి విద్యార్థులను ర్యాగింగ్ పేరిట వేధింపులకు గురి చేయడం చట్ట విరుద్ధమని వెల్లడించారు. విద్యార్థులు చక్కటి వ్యక్తిత్వ వికాసాన్ని మానవీయ విలువలను కలిగి ఉండేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు కోరారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ ప్ల కార్డులతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గాయత్రి, మోహన్, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి శ్రీగిరిలో ఉచిత ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు

**శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి**

**చిన్మయ మిషన్ కు చెందిన బ్రహ్మచారి హరీష్ చైతన్య చే శిక్షణ**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)


చిన్మయ బాలవిహార్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవనంలో ఈ నెల 17 వ తేదీనుండి బాల బాలికలకు ఆధ్యాత్మిక ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. 5 నుండి 17 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు ఉచిత ఆధ్యాత్మిక శిక్షణా తరగతులలో పాల్గొనేందుకు అర్హులు. విద్యార్థులలో నైతిక ధార్మిక ఆధ్యాత్మిక విలువలతో పాటు భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలుగ చేస్తారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు,, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్ ,. ఆలూరు జై శంకర్., ఆలూరు ఫణి కుమార్.. ఆలూరు కుమార్ ఆత్రేయ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. ప్రతి ఆదివారం ఉదయం 9:30 నుండి 11 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయి. తల్లిదండ్రులు తప్పనిసరిగా బాలవిహార్ శిక్షణ తరగతులు జరిగే సమయంలో ప్రాంగణంలో ఉండాలని నిర్వాహకులు సూచించారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు ఒంగోలు శ్రీగిరి దేవస్థాన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు కోరారు.

# ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా చేయడమే లక్ష్యం

## సిఎం చంద్రబాబునాయుడు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 14)

ఆంధ్రప్రదేశ్ ను కరవు రహిత రాష్ట్రంగా చేయడమే లక్ష్యమని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. జల వనరులు, నీటిపారుదల అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, సాగునీటి సంఘాల నాయకులతో అమరావతి నుంచి గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. భూగర్భ జలాలు పెంచడానికి అధికారులు, సాగునీటి సంఘాల నాయకులు సంయుక్తంగా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. సాగు, తాగునీటి చెరువులు, కాల్వలు అన్నింటిని నీటితో నింపాలన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న చెరువులు, కాల్వల మరమ్మతు పనులలో ఏపీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జలవనరులను కాపాడుకోవడంలో సాగునీటి సంఘాల నాయకులు భాగస్వామ్యం కావాలన్నారు. భూగర్భ జలాలు పెంచితే పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. పూడిక తీత పనులు పూర్తిగా చేయాలని, ఆయకట్టు చివరి భూములకు నీరంధించడం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఆటో మిషన్ మోడ్ లో పని చేయాలన్నారు. వ్యవసాయ, జల వనరులశాఖ అధికారులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. రిజర్వాయర్లు, కాల్వలు పొంగి పారితే నష్ట అపారంగా లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలవనరులు సంరక్షణ బాధ్యత అధికారులు, నీటి సంఘాల నాయకులదేనన్నారు. భారీ వర్షాలతో చెరువులు, పంట కాల్వలు దెబ్బ తినకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంఘాల నాయకులపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. అనంతరం జల వనరులశాఖ అధికారులు, సాగు నీటి సంఘాల నాయకులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని చెరువులు, కాల్వల మరమ్మతు పనులు అన్నింటిని సంఘాల నాయకులు పరిశీలించాలన్నారు. వర్షాల సమయంలో పొంగి పొర్లకొండ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. పంటల సాగు కొరకు అన్ని కాల్వలలో పుష్కలంగా నీరు విడుదలవుతున్నట్లు చెప్పారు. ఆయకట్టులోని ప్రతి చివరి భూమికి నీరంధించాలన్నారు. నీటి విడుదల ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సేంద్రియ






వ్యవసాయంతోనే పంటల సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటలతో అధిక లాభాలు వస్తున్నాయని, మార్కెట్లోనూ డిమాండ్ ఉందన్నారు. అలాంటి లాభసాటి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆ దిశగా రైతులను చైతన్య పరచాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జల వనరుల శాఖ ఎస్సీ అబుతలీమ్, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 14)

బాపట్లలో 79 వ భారత స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. భారీ వర్షాల కారణంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతీయ పండుగను నిర్వహించాలన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం సంబంధిత కళాశాల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు వచ్చినప్పటికీ జాతీయ పండుగను వైభవంగా జరపాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాలు, స్టాల్స్ ప్రదర్శన నిర్వహించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. త్వరగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా, తదితరులు ఉన్నారు.





## పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపు

**ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనం**

**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు**




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

కూటమి ప్రభుత్వం వైపే ప్రజలు ఉన్నారని జగన్ తెలుసుకోవాలి. రౌడీయిజం చేసి,అరాచకాన్ని సృష్టించి ఎన్నికల్లో గెలవాలని చూస్తే ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకుని వైసీపీని నామరూపాలు లేకుండా చేస్తామనే సంకేతాన్నిచ్చారు. రానున్న రోజుల్లో పులివెందుల వైసిపి ఎమ్మెల్యే స్థానం కూడా మా కైవసం అవుతుందని ఎమ్మెల్యే దామచర్ల జోస్యం చెప్పారు. పులివెందుల జెడ్పీటీసీ గెలుపు కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అన్నారు.

# పులివెందుల ప్రజల విశ్వాసాన్ని జగన్ కోల్పోయాడు



**వైసీపీ అధ్యక్షుడిగా, పులివెందుల ఎమ్మెల్యేగా జగన్మోహన్‌రెడ్డి విఫలం**

**జగన్‌రెడ్డి పరామర్శల పేరుతో విధ్వంసం, రెచ్చగొట్టడం చేశారు**

**సూపర్ 6 పథకాలన్నింటినీ అమలు చేస్తున్నాం**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 14)

పులివెందుల నియోజకవర్గ ప్రజల విశ్వాసాన్ని ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి కోల్పోయాడని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని బాపట్ల జిల్లా, ముప్పవరం క్యాంప్ కార్యాలయంలో గురువారం నాడు మంత్రి గొట్టిపాటి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలపై మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... సొంత నియోజకవర్గ ప్రజలు కూడా జగన్ ను నమ్మే పరిస్థితి లేదన్నారు. 2019 నుంచి 2024 వరకు తాము 23 మంది ఎమ్మెల్యేలమే ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యల తరుపున ధైర్యంగా అప్పటి వైసీపీ ప్రభుత్వంపై పోరాడామన్నారు. వైసీపీ చేసిన తప్పుల్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టామని తెలిపారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. విమర్శల పేరుతో విధ్వంసం చేస్తూ రెచ్చగొడుతూ, అమాయక ప్రజల్నితొక్కుకుంటూ పోవడం జగన్మోహన్ రెడ్డికి అలవాటుగా మారిందని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ముందుగా ప్రకటించిన సూపర్ 6 పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. పెన్షన్లను పెంచడంతో పాటు ఆగిపోయిన పింఛన్లను కూడా పునరుద్ధరించామని పేర్కొన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, పిల్లలకు తల్లికి వందనం ఇవ్వడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు మరమత్తులు చేస్తున్నామని, కొత్త రోడ్లను కూడా నిర్మాణం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థల్నీ సర్వనాశనం చేశారని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ వ్యవస్థను ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని ఆయన చెప్పారు. ముప్పవరంలోని క్యాంప్ కార్యాలయంలో ముందుగా 49 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఏడుగురికి ఎల్ఓసీలను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. అనంతరం పంచాయితీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అదే విధంగా పొగాకు రైతుకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., వైసీపీ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన అశాస్త్రీయంగా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన జిల్లాల పునర్విభజన కమిటీ ప్రజాభిప్రాయం సేకరించి కూటమి ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా జిల్లాల పునర్విభజనలో మార్పులు, చేర్పులు జరుగుతాయని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు.





## పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది

### యాగంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 14)

అరాచకాలు రిగ్గింగ్లతో ఇప్పటివరకు గెలుస్తూ వచ్చిన వైయస్ అడ్డాలో మొదటిసారి ప్రజాస్వామ్యం గెలిచిందని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. పులివెందుల ఒంటిమిట్ట స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయకేతనం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం మాచర్ల పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రజాస్వామ్యం ఖూనీ జరిగిన పులివెందులలో మొదటిసారి ప్రజాస్వామ్యం గెలవడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుందన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడం వలన కనీసం వైకాపాకు డిపాజిట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల అరాచక పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడి జగన్ కు బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలనకు తాజా ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు. ఓటమి భరించలేక మాజీ ముఖ్యమంత్రి జగన్ అడ్డగోలుగా విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. తండ్రి వయసున్న చంద్రబాబును జగన్ ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడటం మానుకోవాలని చెప్పారు. జగన్ పైశాచిక ఆనందం పొందడానికి చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ చేసిన పరిపాలన వల్ల అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయి విమర్శించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా తాజాగా పులివెందులలో వచ్చిన ఫలితాలే వస్తాయని యాగంటి పేర్కొన్నారు. పులివెందుల ఒంటిమిట్టలో ఓటర్లను భయభ్రాంతులను చేసింది వైసీపీ అని చెప్పారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత పులివెందల ఓటర్లు మోహాల్లో కొత్త వెలుగులు నిండాయని అన్నారు. ఇకనైనా జగన్ తన బుద్ధి మార్చుకుని అధికార పార్టీపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం రేపు చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఆగస్టు 14)

వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్‌కు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్ కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

# కేఎల్‌వైఈఎస్‌కి ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థినికి మంత్రి స్వామి అభినందనలు

**కేఎల్‌వైఈఎస్‌కు ఎంపికైన ప్రకాశం జిల్లా సింగరాయకొండ గురుకుల ఇంటర్ విద్యార్థిని నూరపోగు డెలీశా**

**విద్యార్థినికి రూ.లక్ష రూపాయల చెక్కును అందజేసిన మంత్రి**

**కేఎల్‌వైఈఎస్ కింద ఏడాది పాటు అమెరికాలో విద్యనభ్యసించనున్న విద్యార్థిని**

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 14)

కేఎల్‌వైఈఎస్ (కెన్నడీ లుగర్ యూత్ ఎక్స్చేంజ్ అండ్ స్టడీ) కి ఎంపికైన సింగరాయకొండ గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థిని నూరపోగు డెలీశాని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందించారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గురుకుల సంస్థ అదనపు కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్, అకాడెమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవ్ రావుతో కలిసి సింగరాయకొండ గురుకుల పాఠశాల విద్యార్థిని డెలీషియా ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థిని అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కెనెడీ-లుగర్ యూత్ ఎక్స్చేంజ్ అండ్ స్టడీ కార్యక్రమం కింద ఉన్నత విద్యను అభ్యసించే అరుదైన అవకాశం పొందింది. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినికి ప్రోత్సాహకంగా రూ. 1,00,000 చెక్కును అందజేశారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, విస్తృత దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని, ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషిని పెంపొందించుకోవాలని మంత్రులు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మరియు ఆమె





## ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)




సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు ఒంగోలు నగరం మినీ స్టేడియం నందు ఆగస్టు 17న జరుగుతున్నాయి ఈ కరాటే పోటీల బ్రోచర్ ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆవిష్కరించి మాట్లాడుతూ మొదటిసారిగా జాతీయస్థాయి కరాటే పోటీలు ఒంగోలు నిర్వహించడం అభినందనీయమని బాలికలకు ఆత్మ రక్షణ కొరకు కరాటే ఎంతో అవసరమని తెలిపారు. ఈ పోటీలకు మా వంతు సహకారం అందిస్తామని తెలిపారు ఈ కరాటే పోటీలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కరాటే అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి మోహన్రావు మాట్లాడుతూ ఈనెల 17న జాతీయస్థాయి జరిగే కరాటే పోటీల్లో ఆల్ ఇండియా హెడ్ కోచ్ కీర్తన్ తోపాటు 12 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి కుమార్, శ్యాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడుతో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే అసోసియేషన్ చైర్మన్ మండవ మురళీకృష్ణ, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



## చిరుత దాడిలో గాయపడిన చిన్నారికి మానవతా దృక్పథంతో సహాయం చేసిన ప్రకాశం పోలీసులు



(షణ్ముఖ వెలుగు, దోర్నాల, ఆగస్టు 14)

మండలంలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో బుధవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న కుడుముల అంజమ్మ అనే మూడు సంవత్సరాల పాపపై చిరుతపులి దాడి చేసింది. పాపను నోటితో పట్టుకొని తీసుకుపోతుండగా, తండ్రి అంజయ్య చూసి గట్టిగా అరవడంతో చిరుతపులి పాపను వదిలి సమీపంలోని చెట్ల పొదల్లోకి వెళ్ళింది. ఈ ఘటనకు స్పందించిన గ్రామ పెద్ద మంతన్న వెంటనే డిఎఫ్ఓతో మాట్లాడి బాలికకు తక్షణ వైద్యం సహాయం అందించేందుకు సుండిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం సంఘటన వివరాలు తెలుసుకున్న దోర్నాల ఎస్ఐ వి మహేష్ మరియు వారి సిబ్బంది బాధిత చిన్నారిని మెరుగైన వైద్యం కోసం దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం కోసం స్వయంగా సహాయం చేయడంతో పాటు, చిన్నారికి ఆర్థిక సాయం అందించి, వారికి పండ్లను ఇచ్చి పరామర్శించడం జరిగింది. చిరుతపులి దాడిలో గాయపడిన చిన్నారి పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్థులు, పోలీసులు, వైద్య సిబ్బంది అందరూ కలిసి చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిచారు.

## రాష్ట్ర ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

బ్రిటీష్ వారి పాలన నుండి విముక్తి పొందటానికి నిర్వహించిన జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు, త్యాగధనులు పోరాటాలు చేశారు. దేశ విముక్తి కోసం చేసిన పోరాటం ప్రపంచంలోనే అపూర్వమైనది. దీర్ఘకాలంగా సాగిన పోరాటంలో ఎంతోమంది స్ఫూర్తి ప్రదాతలు అసువులు బాసారు. వారి త్యాగ ఫలితమే ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారతదేశ సార్వభౌమత్వాన్ని సమగ్రతను కాపాడుకోవడం మన భాధ్యతగా భావించాలి. దేశం కోసం పోరాడిన త్యాగధనులకు నివాళులు అర్పిస్తూ ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ప్రజలందరికి స్వాత్రంత్ర్య స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## మల్లపాలెంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ




(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఆగస్టు 14)

వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు గురువారం పుల్లలచెరువు మండలం మల్లపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైయస్ఆర్‌సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు దోమకాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మల్లపాలెం గ్రామంలో ఇంటింటా పర్యటించి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యూ ఆర్ కోడ్ ను ఆవిష్కరించి స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి..తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ వైయస్ఆర్‌సీపీ నాయకులపై దాడులు, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దాడులపై పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ఎప్పటికప్పుడు స్పందిచలన్నారు. కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి అన్ని విషయాలలో మనకు ముందుంటారని తెలిపారు. కూటమి అరాచకాలను, దాడులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు, సర్పంచ్ ఆవుల రమణ రెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సత్తి రెడ్డి, కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, ఆయా విభాగాల అధ్యక్షులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న అలాగాయపాలెం టిడిపి నాయకులు



**చీకటి రాజకీయాలను పక్కన పెట్టి**

**ప్రజల వెలుగుకి మార్గదర్శకుడైన ఎమ్మెల్యే ఇంటూరి**

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 14)

అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద రైతులందరికీ తొలి విడత పెట్టుబడి సాయం విడుదలైన సందర్భంగా ...కందుకూరు పార్టీ కార్యాలయం నుండి ఆనందంగా రైతులు ఆనందంతో ఉత్సాహంతో జరిగినటువంటి ట్రాక్టర్ల ర్యాలీతో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావుతో కలసి అలాగాయపాలెం టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు పాల్గొన్నారు.





## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### ఎంపీ మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 14)

1947 ఆగస్టు 15 నుండి మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు అనేక మంది సమర యోధులు, మహనీయులు, ప్రజలు 1857 నుండి బ్రిటీష్ పాలన పై జరిపిన సుదీర్ఘ పోరాటాలు, త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. కనుక ఆ మహెూద్యమంలో అనేక పోరాటాలు, త్యాగాలు చేసి అసువులు బాసిన వీరులను స్మరించుకొని, వారికి నివాళులు అర్పించి, ఎల్లవేళలా మన దేశాన్ని కాపాడుచున్న సైనికులకు మనం కృతఘ్నతలు తెలపాలని కోరారు. అందరం ఇళ్ళపై జాతీయ పతాకాలను ఎగురవేసి, దేశ సర్వతోముఖాభివృద్ధికి, ఔన్నత్యతకు, సమగ్రతకు ఎల్లప్పుడు పాటుపడతామని ప్రతినబూనుచూ, నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకోవాలని కోరుచూ ప్రకాశం జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com